క్లుప్తంగా

వీధులను శుభ్రంగా ఉంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. శుక్రవారం హర్షగూడ గ్రామంలో స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ.. మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీపీఓ వెంకట రఘునాథ్, ఈసీ మౌనిక, సిబ్బంది నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

కందుకూరు: మండలంలోని కొత్తగూడ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మంగరాజు ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన విద్యార్థులను స్వాగతిస్తూ సీనియర్ విద్యార్థులు నృత్యాలు, డ్యాన్సులు, ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రమేష్, సైదులు, జయమణి, పర్వతాలుగౌడ్, రామారావు, రామిరెడ్డి, శ్రీనివాస్, ప్రమీల, రాధ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఆశవర్కర్లు

కందుకూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆశవర్కర్ మాధవి అన్నారు. మండల పరిధిలోని సాయిరెడ్డిగూడలో శుక్రవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మాధవి ఆధ్వర్యంలో గ్రామంలో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొల్ల దానయ్య, గద్దగూటి నర్సింహా, తేరటి గోపాల్, యాదయ్య, కందపెద్ద నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐ నాగరాజు

మీర్‌పేట: మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ క్రైం పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ నాగరాజు తెలిపారు. శుక్రవారం బడంగ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మత్తు పదార్థాలకు బానిసైతే కలిగే అనర్థాలను వివరించి వివరించారు. అనంతరం అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

తలకొండపల్లి: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధి పడకల్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆధ్వర్యంలో ఆయన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు అఖిల్, అనిల్ నేతృత్వంలో.. హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో 351 మందికి పలు రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, విజయ్ కుమార్, నరసింహ, శ్రీశైలం, రమేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- రూ.9 కోట్ల వ్యయంతో జల్‌పల్లి చెరువు సుందరీకరణ
- ఎమ్మెల్యే సబితారెడ్డి



చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి చెరువును రూ.9 కోట్ల వ్యయంతో సుందరీకరించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చెరువు అభివృద్ధికి చేపట్టాల్సిన పనుల విషయమై ఆమె శుక్రవారం హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ అధికారులతో కలిసి చెరువు పరిసరాలను పరిశీలించారు. అలుగు పారుతున్న ప్రదేశంతో పాటు ఇటీవల నిమజ్జనం చేసిన ప్రాంతంలో కలియతిరిగారు. చెరువు పరిసరాలలో దుర్వాసన రాకుండా చూడాలని మున్సిపాలిటీ కమిషనర్ వాణిరెడ్డిని ఆదేశారు. ఈ సందర్భంగా సుందరీకరణ అంశాలకు సంబంధించిన మ్యాప్‌ను చూసి హెచ్‌ఎండీఏ అధికారుల ప్రతిపాదనలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరగకుండా ఇప్పటికే ఏర్పాటు చేసిన ఇనుప కంచె లోపల ఉన్నచెట్ల కొమ్మలను తొలగించి, వీక్షకులకు చెరువు అందాలు కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువుకు మరోవైపు కూడా రక్షణ జాలీ కల్పించాలన్నారు. మైసమ్మ ఆలయ సమీపంలో చెరువు మధ్యలో ఉన్న చిన్నగుట్ట వరకు స్టీల్ బ్రిడ్జిని నిర్మించి ఐలాండ్ ఏర్పాటు చేసినట్లయితే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. ముత్యాలమ్మ ఆలయం వైపుపకు కూడా నీరు బయటికి రాకుండా అడ్డుగా గోడ కట్టాలని అధికారులకు సూచించారు.

పర్యాటకులను ఆకర్షించేలా..

గత ప్రభుత్వ హయాంలో చెరువు సుందరీకరణ కోసం హెచ్‌ఎండీఏ నుంచి రూ.9 కోట్లు మంజూరు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో కొంతమేర పనులు జరిగాయన్నారు. మధ్యలో పనులు పెండింగ్‌లో పడ్డాయని, అయినప్పటికీ మిగిలిన నిధులతో మళ్లీ అంచనాలు రూపొందించి, తాజాగా పనులు మొదలు పెడుతున్నామని పేర్కొన్నారు. కట్ట సుందరీకరణ, రెండు వ్యూ పాయింట్లు, ఐలాండ్ ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించేలా చూస్తామన్నారు. రాక్ గార్డెన్‌ను రెండో దశలో ఏర్పాటు చేస్తామన్నారు. చెరువు నీరు రాజేంద్రనగర్ వైపు వెళ్లకుండా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అర్బన్ ఫారెస్ట్ పార్కులో కూడా వాకింగ్ ట్రాక్‌కు రెయిలింగ్, పిల్లలకు ఆట స్థలాన్ని, డ్రైనేజీ సమస్యల కోసం కూడా ఇందులో నుంచి కొన్ని నిధులు వెచ్చిస్తామన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో చాలా వరకు పేద, మధ్య తరగతి ప్రజలు ఉన్న దృష్ట్యా గతంలో పూర్తిస్థాయిలో మౌళిక సదుపాయాల కల్పనకు రూ.25 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నానన్నారు. కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ వాణిరెడ్డి, డీఈ వెంకన్న, హెచ్‌ఎండీఏ డీఈ రామారావు, ఏఈ శివకుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, షర్ఫొద్దీన్ హామెద్, యంజాల జనార్దన్, షేక్ అఫ్జల్, పల్లపు శంకర్, యంజాల అర్జున్, హుస్సేన్, అబ్బాస్, ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ టీకా



అవగాహన ర్యాలీలో చైర్మన్ అబ్దుల్లా సాది తదితరులు

పహాడీషరీఫ్: ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీ షాహీన్‌నగర్ ఫ్రైడే మార్కెట్‌లో శుక్రవారం రేబిస్ టీకా డ్రైవ్‌ను నిర్వహించారు. బ్లూక్రాస్ ఎన్జీఓ, మిషన్ రేబిస్, వరల్డ్ వెటర్నరీ సర్వీసెస్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమాన్ని చైర్మన్ అబ్దుల్లా సాది ప్రారంభించారు. ఈ సందర్భంగా 284 పెంపుడు, వీధి కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. ఎనిమిది శునకాలను కుని ఆపరేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఏడాదికి ఒకసారి కుక్కలకు టీకా వేయడం ద్వారా.. కుక్క కాటు ప్రమాదాలను నివారించవచ్చునని పేర్కొన్నారు. జంతు ప్రేమికులు కూడా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కలను ప్రజల చేరదీసి, వాటికి ఆహారం అందజేసి ఆదరించాలని కోరారు. అనంతరం స్వచ్ఛత హి సేవా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వాణి రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రీను పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఎరువులు

- రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి
- పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్ గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్

ఆమనగల్లు: రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా అన్నారు. శుక్రవారం పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగిల్‌విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, అన్నదాతలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, క్వింటా వరికి రూ.2320 మద్దతు ధర పొందాలని చెప్పారు. సన్నరకం వడ్లకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం క్వింటాకు రూ.500లను అందించనుందని తెలిపారు.

విద్యారుణం రూ.40 లక్షలు

సింగిల్‌విండో ద్వారా రైతుల ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు గంప పేర్కొన్నారు. వారి పిల్లల ఉన్నత చదువుల నిమిత్తం (విదేశాలకు వెళ్లేవారికి)రూ.40 లక్షల వరకు విద్యారుణాలు అందివ్వనున్నట్లు వెల్లడించారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాలకు సంబంధించి 388 మంది రైతులు రుణమాఫీకి ఎంపికయ్యారని, ఇందులో 215 మందికి రూ.2 లక్షల మాఫీ అయిందని ఆయన చెప్పారు. మిగతా 173 మంది త్వరలో లబ్ధి పొందనున్నారని స్పష్టంచేశారు. సమావేశంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, వెంకటయ్య, సేవ్యానాయక్, దోళ్యానాయక్, చేగూరి వెంకటేశ్, శ్రీపాల్, చెన్నమ్మ, జంగమ్మ, డీసీసీబీ ఆమనగల్లు శాఖ మేనేజర్ గోపాల్, సీఈఓ దేవేందర్, సిబ్బంది అల్లాజీ, పద్మాకర్‌రెడ్డి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణం చెల్లించండి..

- పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి
- కొత్తగా రూ.కోట్ల రుణాలు



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రైతులు తీసుకున్న దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను నిర్ణీత వ్యవధిలో చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ బిట్ల వెంకట్‌రెడ్డి సూచించారు. పాత రుణాలు చెల్లిస్తేనే కొత్త రుణాలకు అవకాశం ఉంటుందని, తద్వారా బ్యాంకు అభ్యున్నతికి దోహదపడిన వారమవుతామని పేర్కొన్నారు. దండుమైలారం(రాచకొండమైలారం) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024- 25 సంవత్సరానికి గాను రైతులకు రూ.3 కోట్ల కొత్త రుణాలను ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

గిడ్డంగి నిర్మాణం..

పీఏసీఎస్ పాలకవర్గం తీసుకున్న చొరవతో ప్రభుత్వం మూడున్నర ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. ఈ స్థలంలో ధాన్యం నిల్వకు గిడ్డంగితో పాటు.. అందరికీ ఉపయోగపడే విధంగా ఫంక్షన్ హాల్‌ను నిర్మించాలని పాలకవర్గం తీర్మానించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ప్రాంతీయ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ నవీన్ కాంత్‌రెడ్డి, సహకార సంఘం అధికారి సరస్వతి, డైరక్టర్లు నర్రా అయ్యప్పరెడ్డి, బాలరాజ్ యాదవ్, మంచాల అంజమ్మ, సార్ల మైసమ్మ, దొండ యాదిరెడ్డి, జిలకపల్లి ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ సెక్రటరీ ధన్‌రాజ్ పాల్గొన్నారు.

పట్టుదలతోనే కలల సాకారం

'ఆవిష్కార్' సాంకేతికోత్సవం ముగింపులో విద్యావంతులు

అబ్దుల్లాపూర్‌మెట్: 'పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు చేయాలి. సమాజానికి దోహదపడాలి. పట్టుదలతో కలలను సాకారం చేసుకోవాలి' అని విద్యావంతులు సూచించారు. మండల పరిధి పిగ్లీపూర్ గ్రామం అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'ఆవిష్కార్' సాంకేతికోత్సవం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ శాస్త్రవేత్త శ్రీనిలాంగి త్రివేది, అన్నమాచార్య విద్యాసంస్థల ఎగిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ.. చదువులో ఉన్నతంగా రాణించి గుర్తింపు పొందాలని సూచించారు. రెండు రోజులు సాగిన వర్క్‌షాప్‌లో 450 మంది ఈసీఈ, సీఎస్‌సీ విభాగాలకు చెందిన విద్యార్థులు.. పలు సాంకేతిక ప్రదర్శనలు చేశారు. ఇందులో ఎదుటి మనిషికి అభివాదం చేసే రోబో, డ్రోన్లు, మొబైల్ స్టేషన్ యాంటిన విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీవీ కృష్ణమూర్తి, కలాం యూత్ ఎక్సలెన్స్ ఇండియా ఫౌండర్ నరేష్, కార్యక్రమ కన్వీనర్లు ఆరెంపుల శ్రీనివాసరావు, రమేష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సమతాపురి, డీర్ పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు. 11కేవీ కమలానగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు. 11కేవీ ఇందిరానగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ యాదవనగర్, 11కేవీ ఆదర్శనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు. 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 1.30 నుంచి 3గంటల వరకు. 11కేవీ నేతాజీనగర్, అల్కాపురి ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యాసంస్థల్లో వసతులు కల్పించాలి

కందుకూరు: ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన వసతులు కల్పించి విద్యార్థుల భవిష్యత్ కాపాడాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ అమరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగంలో ఉన్నటువంటి అన్ని సంస్థలను బాగుచేయాలన్నారు. చాలా పాఠశాలలు, కళాశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని సమస్యలు పరిష్కరించాలన్నా రు. లేనిపక్షంలో ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు టి.రవీందర్, జిల్లా కో-కన్వీనర్లు రాము, శేఖర్, మండల నాయకులు భాస్కర్, ప్రదీప్, మహిపాల్, హనుక్ మైపాల్, స్వామి, ఓంకార్ పాల్గొన్నారు.

విద్యాధికారికి సన్మానం



ఎంఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తలకొండపల్లి: మండల విద్యాధికారిగా చాంప్లా నాయక్ శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓను బోధనా సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సి లక్ష్మీ, రామానాథం, అంజయ్య, విష్ణుమూర్తి, పాండు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది మల్లేశ్, శేఖర్, విజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగించొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించొద్దని ఆర్యవైశ్య సంఘం బాలాపూర్ మండల అధ్యక్షుడు నాళ్ల శ్రీనివాస్‌గుప్తా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్యవైశ్యలతో కలిసి బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేకంగా రాష్ట్రం ఉండాలని, నాడు ఆంధ్రరాష్ట్రం కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. అలాంటి దేశ భక్తుని పేరును తొలగించడం సరికాదన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు యథావిధిగా ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రంలో విన్నవించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మీర్‌పేట్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తొనుపునూరి శ్రీనివాస్‌గుప్తా, మంచాని ప్రేమ్‌కుమార్‌గుప్తా, జల్‌పల్లి అధ్యక్షుడు ఆకుల చంద్రప్రకాశ్‌గుప్తా, నాదర్‌గుల్ అధ్యక్షులు వంగాల ఓంకారంగుప్తా, మహిళా సంఘం అధ్యక్షురాలు దుద్దెళ్ల రమాదేవి, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ సేవలు చిరస్మరణీయం



లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

తుక్కుగూడ: తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగేల హేమలత రాజుగౌడ్, కమిషనర్ బి.వెంకట్రామ్, మేనేజర్ పర్వతాలు, ఏఈ కె.భార్గవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మధుమోహన్, యాదగిరిరెడ్డి, శివకుమార్, విలాస్, లావణ్య, రాజు, నాయకులు శ్రీకాంత్, సుధాకర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..



బడంగ్‌పేట్: నివాళులర్పిస్తున్న నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: స్వాతంత్య్ర సమరయోధుడు, చివరి శ్వాస వరకు రాష్ట్రం కోసం పరితపించిన ఉద్యమ కెరటం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో కొండా లక్ష్మణ్ జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చల్ల నర్సింహారెడ్డి కొండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి, పేద ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు.

అందరికీ అందుబాటులో సహకార సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న పెంటారెడ్డి

- అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి

బడంగ్‌పేట్: కేవలం రైతుల కోసమే కాకుండా మల్టీపర్పస్‌లో బాలాపూర్ ఖాల్సా సహకార సంఘాన్ని అభివృద్ధి చేసి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిపామని ఆ సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని బాలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (బండ్లగూడ ఖాల్సా) 49వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని బాలాపూర్‌లో నిర్వహించారు. అధ్యక్షుడు, మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్యులుగా హాజరయ్యారు. సీఈవో ఎర్ర జైహింద్ వార్షిక నివేదికను ఖాతాదారులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా పెంటారెడ్డి మాట్లాడుతూ.. ఈ సంఘంలో వ్యవసాయదారులకు స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందిస్తూ సకాలంలో ఆదుకుంటున్నామన్నారు. అదేవిధంగా సేవింగ్, రికవరింగ్, ఫిక్స్‌డ్, బాలగణేశ్ డిపాజిట్లు సేకరించి అత్యంత లాభాల్లో నడిపిస్తూ ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. బంగారు అభరణాలపై రుణాలు, వాటితో పాటు ఇతర రుణాలు, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పొదుపు సంఘాలకు రుణాలు అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో బాలాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో 40 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిపినట్లు వెల్లడించారు. ఫలితంగా 25 లక్షల లాభాల్లో ఉన్నామని తెలిపారు. 37 మంది రైతులకు రూ.18లక్షల రుణమాఫీ అయిందని మరో 91 మందికి రూ.54 లక్షలు రుణమాఫీ కాలేదన్నారు. మేయర్ పారిజాత మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. సహకార సంఘం అభివృద్ధికి సహకారం అందిస్తున్న గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సహకారం సంఘం ఉపాధ్యక్షుడు కొలన్ తిరుపతిరెడ్డి, పాలకమండలి సభ్యులు కళ్లెం నిరంజన్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, కొంతం అరుణరెడ్డి, నిరుడి నర్సమ్మ, రావుల లింగం, కొంతం సంపత్‌రెడ్డి, మేకల మహేందర్, ఇబ్రాం బాలయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, మహిళా సంఘం సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

'ఫార్మాసిటీ భూములను మా పేరిట మార్చండి'

యాచారం: ఫార్మాసిటీకి అని తీసుకున్న భూములను.. టీజీఐఐసీ పేరిట మార్చారని, ఆ పట్టా భూములను మరలా.. తమ పేరిట మార్చాలని ఫార్మా భూ బాధితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను గాంధీభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, పట్టా భూములను ఫార్మాసిటీకి సేకరించబోమని కాంగ్రెస్ పార్టీ పెద్దలు చెప్పారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక పట్టా భూములను సైతం తీసుకోవడానికి ప్రభుత్వం యత్నిస్తుందని ఆరోపించారు. విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు ముత్యాల వెంకట్‌రెడ్డి, దార చెన్నయ్య, దార సత్యం, రాజశేఖర్‌రెడ్డి, అచ్చిరెడ్డి, గణేశ్, వెంకట్‌రెడ్డి, నిర్మలమ్మ, మహేందర్‌రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదపోయె... బురద నిలిచె!

- అంతర్గత రహదారుల్లో ఎక్కడి బురద అక్కడే



మిథులానగర్ చర్చి వీధిలో నిలిచిన బురద



మరో వీధిలో..

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు కింద ఉన్న మిథులానగర్, సత్యసాయినగర్ కాలనీలను ట్రంక్‌లైన్ ఓవర్‌ఫ్లోతో వరదనీరు ముంచెత్తిన విషయం తెలిసిందే. గురువారం మధ్యాహ్నం తర్వాత వరదనీరు పూర్తిగా వెళ్లిపోవడంతో వీధుల్లో పెద్దఎత్తున బురదవచ్చి చేరింది. కొంతమంది తాత్కాలికంగా అప్పటికప్పుడూ తమ ఇళ్ల ఎదుట ఉన్న బురదను తొలగించారు. కాగా శుక్రవారం మున్సిపల్ సిబ్బంది జేసీబీ ద్వారా మిథులానగర్ ప్రధాన రహదారిపై బురదను తొలగించి బ్లీచింగ్ చల్లారని, బురదను కూడా పూర్తిగా తొలగించకుండా పైపైనే పనులు చేశారని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

బురదమయమైన వీధులు..

కాలనీలోని వీధులన్నీ బురదమయం కావడంతో ఇళ్లలో నుంచి అడుగు బయట పెట్టలేని పరిస్థితి నెలకొందని, వీధుల్లో, వాకిళ్లలో పెద్దఎత్తున బురద చేరడంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వీధుల్లో నిలిచిన బురదను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.